సంగారెడ్డి, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): కేసీఆర్ అంటే ఆపన్నులకు ఒక నమ్మకం. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కేసీఆర్ పెద్దదిక్కు. ఆసరా పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, కల్లు గీత కార్మికుల్లో కొండంత ధైర్యం నింపారు సీఎం కేసీఆర్. ప్రతినెలా రూ.2016 పెన్షన్ డబ్బులు ఇచ్చి బతికేందుకు ధైర్యం కల్పించారు. మరీ ముఖ్యంగా దివ్యాంగులకు ప్రతినెలా రూ.4016 పింఛన్ అందజేస్తూ వారిపాలిట దైవంగా మారారు. 2014కు ముందు కేవలం రూ.200 పెన్షన్ మాత్రమే వచ్చేది. సీఎం కేసీఆర్ వచ్చాక ఆసరా పెన్షన్ పథకం ద్వారా పెన్షన్ మొత్తాన్ని ఏకంగా రూ.2016కు పెంచారు. దివ్యాంగులకు దశలవారీగా పింఛన్ పెంచుతూ వచ్చారు. ప్రస్తుతం దివ్యాంగులు రూ.4016 పింఛన్ అందుకుంటున్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అయితే పెన్షన్ మరింతగా పెరగనున్నది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6,016, ఇతర పింఛన్ లబ్ధిదారులకు రూ.5,016 ఇవ్వనున్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ద్వారా పెన్షన్ మొత్తం పెంచుతామని ప్రకటించడంతో పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ఇచ్చిన మాటతప్పరని, అధికారంలోకి రాగానే పింఛన్లు తప్పకుండా పెంచుతారని పింఛన్‌దారులు విశ్వాసంతో ఉన్నారు.


# ఆపన్నులకు వరం..
# ఆసరా పథకం

## వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెద్దదిక్కుగా సీఎం కేసీఆర్

- సంగారెడ్డి జిల్లాలో 1.61 లక్షల పింఛన్ లబ్ధిదారులు
- జిల్లాలో ప్రతినెలా రూ.37.20 కోట్ల పింఛన్ అందజేత
- దివ్యాంగులకు ఇటీవలే 3,016 నుంచి రూ.4016 పెరిగిన పింఛన్
- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అయితే మరింత పెరగనున్న పెన్షన్
- పింఛన్లు పెంచుతామని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో హామీ
- దివ్యాంగులకు రూ.6వేలు, ఇతర వర్గాలకు రూ.5,016 పెరిగే అవకాశం
- ఇంటిపెద్దలా ఆదుకుంటున్న కేసీఆర్ వెన్నంటే ఉంటామంటున్న పింఛన్‌దారులు

కేసీఆర్ మాట ఇస్తే తప్పరని సంతోషపడుతున్న పింఛన్‌దారులు






### ప్రతినెలా 1.61 లక్షలమందికి రూ.37.20 కోట్లు పింఛన్

సంగారెడ్డి జిల్లాలో ఆసరా పథకం ద్వారా ప్రతినెలా 1,61,341 మందికి రూ.37.20కోట్ల పింఛన్ అందజేస్తున్నారు. సీఎం కేసీఆర్ పింఛన్ అందుకునే వయస్సును 57కు కుదించారు. వయోవద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులకు ప్రభుత్వం పింఛన్ అందజేస్తుంది. ఏటా ప్రభుత్వం ఆసరా పింఛన్ ద్వారా రూ.432 కోట్లు 1.61 లక్షల మంది లబ్ధిదారులకు అందజేస్తుంది. తొమ్మిదేండ్లలో ప్రభుత్వం రూ.2,458 కోట్ల పింఛన్‌ను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. జిల్లాలో 62,072 మంది వృద్ధాప్య పింఛన్లు అందుకుంటున్నారు. 15,016 మంది దివ్యాంగులు ప్రతినెలా రూ.4,016 పింఛన్ తీసుకుంటున్నారు. వీరితో పాటు 72,371 మంది వితంతువులు, 721 మంది చేనేత కార్మికులు, 853 మంది గీత కార్మికులు, 7,572 మంది ఒంటరి మహిళలు, 112 మంది బీడీ కార్మికులు పింఛన్ అందుకుంటున్నారు. అలాగే 2,084 వృద్ధ కళాకారులు, 395 మంది ఫైలేరియా బాధితులు, 143 మంది డయాలసిస్ రోగులు పింఛన్లు తీసుకుంటున్నారు. ప్రతినెలా 1,61,341 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.37.20 కోట్లు పింఛన్ డబ్బులు జమ అవుతున్నాయి. పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు కేసీఆర్ చేస్తున్న ఆర్థికసాయం అందుకుని సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ఇంటి పెద్దలా పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్న కేసీఆర్ వెన్నంటే ఉంటామని పింఛన్‌దారులు చెబుతున్నారు.

**నియోజకవర్గాల వారీగా పింఛన్ లబ్ధిదారులు**

| నియోజకవర్గం | లబ్ధిదారుల సంఖ్య | మొత్తం(ప్రతినెలా) |
|---|---|---|
| అందోలు | 25401 | రూ.5,89,54.336 |
| నారాయణఖేడ్ | 30,858 | రూ.7,17,63,408 |
| పటాన్‌చెరు | 25935 | రూ.6,08,44,024 |
| సంగారెడ్డి | 30297 | రూ.6,95,12.184 |
| జహీరాబాద్ | 42042 | రూ.9,59,65,744 |
| హత్నూర(నర్సాపూర్) | 6808 | రూ.1,50,40,672 |

# ఆసరాతో..
# ఆర్థిక భరోసా!

## మెదక్ జిల్లాలో 1,16,604 పింఛన్లు

- వృద్ధులు 39,871 మంది, దివ్యాంగులు 8544, వితంతువులు 46,166 మంది
- భర్త చనిపోతే భార్యకు 'ఆసరా' వర్తింపు
- గతంలో రూ.200లు.. ఇప్పుడు రూ.2.016

**అభాగ్యుల పాలిట** ఆసరాగా మారి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నది ఆసరా పింఛన్. వృద్ధులకు చేతికర్ర వలే ఊతమిస్తున్నది. దివ్యాంగులు దిగులు చెందకుండా వారికి సీఎం కేసీఆర్ లాంటి పెద్దన్న ఉన్నాడన్న భరోసా కల్పిస్తున్నది. బతుకు జీవిడా అంటున్న వితంతువులు, ఒంటరి మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పిస్తూ, ముందడుగు వేసేందుకు ధైర్యాన్ని కల్పిస్తున్నది ఆసరా..

*-మెదక్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ)*

### గతంలో రూ.200 పింఛన్..

గత ప్రభుత్వాల హయాంలో పింఛన్లు రూ.70, ఆ తర్వాత 200 ఇచ్చేవారు. అవి కూడా అందరికీ వచ్చేవి కావు. కొత్తగా ఓ వ్యక్తికి పెన్షన్ ఇవ్వాలంటే మరో పెన్షన్‌దారుడు చనిపోతే తప్పా వచ్చేది కాదు. అందుకే తెలంగాణ ఉద్యమ సమయంలోనే సీఎం కేసీఆర్ ఇలాంటి దారుణాలను ప్రజలకు వివరిస్తూ స్వరాష్ట్రంలో సంక్షేమం గురించి ఆలోచించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం సాధించి, తాను ముఖ్యమంత్రి అయ్యాక ఆసరా పెన్షన్ల పెంపుపై దృష్టి సారించారు. రూ.200 నుంచి వృద్ధాప్య, వితంతు పెన్షన్‌ను వెయ్యి రూపాయలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.1500కు పెంచి ఆసరాగా నిలిచారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు చేపట్టారు. 2018 ఎన్నికల సమయంలో మరోసారి ఆసరా పెన్షన్లను పెంచనున్నట్లు ప్రకటించి, అధికారంలోకి రాగానే డబుల్ చేశారు. వృద్ధాప్య, వితంతువుల పెన్షన్లను రూ.2,016కు, దివ్యాంగుల పెన్షన్ రూ.3,016కు పెంచారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4,016కు పెంచి అమలుచేస్తున్న విషయం తెలిసిందే.

### మెదక్ జిల్లాలో 1,16,604 పింఛన్లు

మెదక్ జిల్లాలో 1,16,604 పింఛన్లు ప్రతి నెలా లబ్ధిదారులకు అందుతున్నాయి. వీటి కోసం ప్రతినెలా రూ.26 కోట్ల 41లక్షల 86 వేల 736 పింఛన్‌దారులకు అందుతున్నది. జిల్లాలో వృద్ధులు 39,871 మంది, దివ్యాంగులు 8544, వితంతువులు 46,166 మంది, గీతా కార్మికులు 910, ఒంటరి మహిళలు 4257, చేనేత కార్మికులు 482 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.26 కోట్ల 41 లక్షల 86 వేల 736లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించే నాటికి రాష్ట్రంలో ఆసరా పింఛన్ల కింద వృద్ధులకు రూ.200లు అందేది. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2000లకు పెంచింది. దివ్యాంగులకు ఆసరా పథకం కింద నెలకు రూ.500 పింఛన్ అందేది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1500కు పెంచింది. కేసీఆర్ రెండోసారి సీఎం అయ్యాక రూ.3016 చేశారు. ప్రస్తుతం మరో వెయ్యి పెంచి రూ.4016 చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నుంచి అమలుచేస్తూ జీవో జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాలో పింఛన్ తీసుకునే దివ్యాంగులు 8,544 మంది ఉండగా, వారికి ప్రతి నెలా రూ.3016 చొప్పున రూ.25 లక్షల 76వేలు చెల్లిస్తున్నది.

### భర్త చనిపోతే భార్యకు 'ఆసరా' వర్తింపు

జిల్లాలో దారిద్ర్య దిగువ రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ఆసరా పథకం వర్తింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే భర్త చనిపోతే వితంతువులకు వెంటనే ఆసరా పింఛన్ పథకంలో అర్హురాలిగా గుర్తించేలా ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో వితంతువుల నుంచి ఆసరా పథకానికి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా సర్వే నిర్వహించి, లబ్ధిదారుల పేర్లు గుర్తించారు. ఈ నెలాఖరులోగా కొత్తగా గుర్తించిన వారి జాబితాను ప్రకటించనున్నారు. వీరికి త్వరలోనే రూ.2016 నగదు మొత్తాన్ని ఆసరా పింఛన్ కింద అందజేయనున్నారు.

### కుటుంబంలో ఒకరికే ఆసరా..

కుటుంబ సామాజిక భద్రతలో భాగంగా ఆసరా పథకానికి అర్హులుగా 57 ఏండ్లకు పైబడి ఉన్న భార్యాభర్తల్లో ఒకరికి మాత్రమే కుటుంబానికి వర్తింపజేసేలా గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆసరా పింఛన్ పొందుతున్న వృద్ధుడి భార్య చనిపోతే.. ఆయన స్థానంలో 57 ఏళ్లకు పైబడి ఉండే భార్యలకు ఆ స్థానంలో అర్హత కల్పించేలా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిరుపేద కుటుంబాల్లో భార్య చనిపోయినా.. వారికి సామాజిక భద్రత కల్పించేలా ఆసరా పథకాన్ని అందిస్తున్నామని అధికారులు వెల్లడించారు.



హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు మహ్మద్ సుల్తాన్

# బీఆర్ఎస్‌లోకి రాయికోడ్ కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు

- ఆహ్వానించిన మంత్రి హరీశ్‌రావు
- ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతోనే చేరానన్న మహ్మద్ సుల్తాన్

రాయికోడ్, నవంబర్ 6: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరానని రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహ్మద్ సుల్తాన్ అన్నారు. సోమవారం సింగీతం గ్రామానికి చెందిన మహ్మద్ సుల్తాన్ తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు నివాసంలో రాష్ట్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్ ఆధ్యర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మహ్మద్ సుల్తాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, మైనార్టీలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవని కొనియాడారు. రాయికోడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో మైనార్టీలను ఏకం చేసి అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ఆయన వెంట నర్సింగ్‌రావు, తుల్జయ్య, ఎండీ మోహిన్, యూసుఫ్, శారీఫ్ తదితరులు ఉన్నారు.



## ఎన్నికలు ఏవైనా ఎగిరేది బీఆర్ఎస్ జెండానే..

# సిద్దిపేట.. గులాబీ కంచుకోట




## 1952లో సిద్దిపేట నియోజకవర్గం ఏర్పాటు
## 1985లో తొలిసారిగా కేసీఆర్ ఎమ్మెల్యేగా ఎన్నిక





**2004** ఉపఎన్నిక నుంచి హరీశ్‌రావు అడ్డా

- సిద్దిపేట నుంచి కేసీఆర్, హరీశ్‌రావు డబుల్ హ్యాట్రిక్
- ఏడో సారి బరిలోకి దిగుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఈ ఎన్నికల్లో లక్షా యాభై వేల ఓట్ల మెజార్టీ లక్ష్యంగా పనిచేస్తున్న శ్రేణులు
- నిత్యం అందుబాటులో ఉండే నేతకు పట్టం కడుతున్న ప్రజలు
- సిద్దిపేటలో ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లు దక్కడమే కష్టం

**ఉద్యమాల పురిటిగడ్డ..** అభివృద్ధి పూదోట... గులాబీ కంచుకోట సిద్దిపేట. ఎన్నికలు ఏవైనా ఇక్కడ ఎగిరేది గులాబీ జెండానే. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆరుసార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత స్థానంలో మంత్రి హరీశ్‌రావు ఆరు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం ఏడోసారి బరిలోకి దిగుతున్నారు. సిద్దిపేట నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. మొదటి ఎమ్మెల్యే పీడీఎఫ్ పార్టీ తరపున పోటీ చేసిన ఎడ్ల గురువారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పి.రాజేశ్వర్‌రావుపై గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీ ప్రభావం ఉన్నప్పటికీ తర్వాత కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న సిద్దిపేట నియోజకవర్గ ముఖచిత్రం కేసీఆర్ చేతిలోకి వెళ్లిపోయింది.

*- సిద్దిపేట, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*


### డబుల్ హ్యాట్రిక్ కేసీఆర్...

సిద్దిపేట నియోజకవర్గానికి తొలిసారి ఎన్నికల్లో ఎడ్ల గురువారెడ్డి పీడీఎఫ్ పార్టీ నుంచి, తర్వాత ఎన్నికల్లో పీవీ నాగేశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీ, సోమేశ్వర్‌రావు స్వతంత్ర, పీవీ రాజు కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. పీవీ రాజు మంత్రిగా పనిచేశారు. అనంతుల మదన్‌మోహన్ 1970లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. రాష్ట్ర మంత్రిగా, ప్రతిపక్ష నేతగా తనదైన ముద్ర వేశారు. బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఏడుసార్లు పోటీచేసి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక్కడి నుంచి డబుల్ హ్యాట్రిక్ సాధించిన వారిలో కేసీఆర్ ఒకరు. నాలుగు సార్లు టీడీపీ నుంచి, రెండుసార్లు బీఆర్ఎస్ నుంచి గెలుపొంది ప్రత్యేకత చాటారు. తొలుత 1983లో టీడీపీ తరపున సిద్దిపేట శాసనసభ నియోజకవర్గం నుంచి కేసీఆర్ పోటీచేసి తన రాజకీయ గురువైన మదన్‌మోహన్ చేతిలో కేవలం 879 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం మధ్యంతర ఎన్నికల్లో 1985లో సిద్దిపేట నుంచి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డిపై తొలిసారిగా విజయం సాధించారు. అప్పటి నుంచి సిద్దిపేటను తన కంచుకోటగా మలుచుకున్నారు. 1985లో టీడీపీ తరఫున 16,156 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇలా వరుస ఎన్నికల్లో 1989లో 13,816 ఓట్ల మెజార్టీ, 1994లో 27,107 ఓట్ల మెజార్టీ, 1999లో 27,555 ఓట్ల మెజార్టీతో టీడీపీ తరఫున కేసీఆర్ వరుసగా గెలుపొందారు. 2001లో బీఆర్ఎస్ పార్టీని స్థాపించిన అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో సిద్దిపేట నుంచి 58,712 ఓట్ల మెజార్టీతో కేసీఆర్ గెలుపొందారు.

### తెలంగాణ ఏర్పాటు తర్వాత...

తెలంగాణ ఏర్పడిన తర్వాత నూతన జిల్లాగా సిద్దిపేట ఏర్పాటైంది. కొత్త మండలాలు సైతం ఏర్పాటయ్యాయి. సిద్దిపేట నియోజకవర్గంలో సిద్దిపేట మున్సిపాలిటీతో పాటు సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, నంగునూరు, నారాయణరావుపేట మండలాలు ఉన్నాయి. మొదటిసారి 1983లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కేసీఆర్ కాంగ్రెస్ అభ్యర్థి అనంతుల మదన్‌మోహన్ చేతిలో స్వల్పఓట్ల తేడాతో ఓడిపోయారు. 1985లో సిద్దిపేట నుంచి కేసీఆర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ మాటకు తిరుగు లేదు. సిద్దిపేట ప్రజలు కేసీఆర్, హరీశ్‌రావు వెంటే ఉన్నారు. ఈ సెగ్మెంట్‌లో ప్రతి ఎన్నికల్లో ప్రత్యర్థులు డిపాజిట్లు కాపాడుకోవడానికే కష్టాలు పడుతున్నారు.

**సిద్దిపేట నియోజకవర్గం రౌండప్**



### సిద్దిపేట.. హరీశ్‌రావు అడ్డ

సిద్దిపేట మంత్రి హరీశ్‌రావు అడ్డ...ఇక్కడి నుంచి మంత్రి హరీశ్‌రావు ఏడోసారి బరిలోకి దిగుతున్నారు. ప్రతి ఎన్నికల్లో ప్రత్యర్థుల డిపాజిట్లు కొల్లగొట్టే విధంగా తన రాజకీయ చతురతతో ఎన్నికల బరిలో దూసుకుపోతున్నారు. 2004 అక్టోబర్‌లో మొదటిసారి సిద్దిపేట శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీచేశారు. ఈ ఎన్నికలో తన సమీప టీడీపీ అభ్యర్థి చెరుకు ముత్యంరెడ్డిపై 24,827 ఓట్ల మెజార్టీతో హరీశ్‌రావు గెలుపొందారు. అప్పటి నుంచి విజయాలతో దూసుకెళ్తున్నారు. తర్వాత ప్రతి ఎన్నికల్లో తన మెజార్టీని తానే అధిగమిస్తూ ప్రత్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేస్తూ తిరుగులేని నేతగా ఎదిగారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి పై 58,935 ఓట్లతో రికార్డు స్థాయి మెజార్టీతో గెలుపొందారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 64,014 ఓట్ల మెజార్టీ సాధించి తన రికార్డును తానే తిరగరాశారు. 2010లో మరోసారి జరిగిన ఉప ఎన్నికల్లో 95,858 ఓట్లతో రాష్ట్రంలోనే అత్యధిక రికార్డు మెజార్టీతో నంబర్-1గా నిలిచారు. 2014 ఎన్నికల్లో హరీశ్‌రావుకు 1,08,699 ఓట్లు రాగా తన సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌కు 15,371 ఓట్లు, బీజేపీ అభ్యర్థి విద్యాసాగర్‌కు 13,003 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో హరీశ్‌రావు 93,328 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకు 1,31,295 ఓట్లు రాగా తన సమీప అభ్యర్థి భవానీరెడ్డి (టీజేఎస్) 12,596 ఓట్లు, బీజేపీ అభ్యర్థి నరోత్తంరెడ్డికి 11,266 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో మంత్రి హరీశ్‌రావు 1,18,699 ఓట్ల మెజార్టీతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈసారి లక్షా యాభై వేల ఓట్ల మెజార్టీ సాధించాలనే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో పలు గ్రామాలు బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలియజేశాయి.ఇంటింటి ప్రచారాన్ని ఉధృతం చేశారు.

**1952 నుంచి సిద్దిపేటలో గెలుపొందిన అభ్యర్థుల వివరాలు ఇలా...**

| సంవత్సరం | ఎన్నికైన ఎమ్మెల్యే | గెలుపొందిన పార్టీ | సమీప ప్రత్యర్థి |
|---|---|---|---|
| 1952 | ఎడ్ల గురువారెడ్డి | పీడీఎఫ్ | పీవీ రాజేశ్వర్‌రావు |
| 1957 | పి.రాజేశ్వర్‌రావు | కాంగ్రెస్ | ఎడ్ల గురువారెడ్డి |
| 1962 | సోమేశ్వర్‌రావు | స్వతంత్ర | పీవీ రాజేశ్వర్‌రావు |
| 1967 | వీబీ రాజు | కాంగ్రెస్ | ఎడ్ల గురువారెడ్డి |
| 1970 (ఉప ఎన్నిక) | ఎ.మదన్‌మోహన్ | తెలంగాణ ప్రజాసమితి | పీవీ రాజేశ్వర్‌రావు |
| 1972 | ఎ. మదన్‌మోహన్ | కాంగ్రెస్ | ఎస్.వెంకటరావు |
| 1978 | ఎ.మదన్‌మోహన్ | కాంగ్రెస్ (ఐ) | టి. మహేందర్‌రెడ్డి |
| 1983 | ఎ.మదన్‌మోహన్ | కాంగ్రెస్ | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు |
| 1985 | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | టీడీపీ | టి.మహేందర్‌రెడ్డి |
| 1989 | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | టీడీపీ | ఎ.మదన్‌మోహన్ |
| 1994 | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | టీడీపీ | ఎ.మదన్‌మోహన్ |
| 1999 | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | టీడీపీ | ఎం.స్వామిచరణ్‌గౌడ్ |
| 2001 (ఉప ఎన్నిక) | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | బీఆర్ఎస్ | మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి |
| 2004 | కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | బీఆర్ఎస్ | జిల్లా శ్రీనివాస్ |
| 2004 (ఉప ఎన్నిక) | తన్నీరు హరీశ్‌రావు | బీఆర్ఎస్ | చెరుకు ముత్యంరెడ్డి |
| 2008 (ఉప ఎన్నిక) | తన్నీరు హరీశ్‌రావు | బీఆర్ఎస్ | బైరి అంజయ్య |
| 2009 | తన్నీరు హరీశ్‌రావు | బీఆర్ఎస్ | బైరిఅంజయ్య |
| 2010 (ఉప ఎన్నిక) | తన్నీరు హరీశ్‌రావు | బీఆర్ఎస్ | టి.శ్రీనివాస్‌గౌడ్ |
| 2014 | తన్నీరు హరీశ్‌రావు | బీఆర్ఎస్ | టి.శ్రీనివాస్‌గౌడ్ |
| 2018 | తన్నీరు హరీశ్‌రావు | బీఆర్ఎస్ | భవాని |